సాక్షి ప్రకాశం

ఆదివారం । 21 । మే । 2023



నగర ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

ఒంగోలు నగర ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. - 8లో..



చిత్తశుద్ధితో ఉన్నత స్థానం

చిత్తశుద్ధి, పట్టుదలతో న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థానాలు సాధించవచ్చని హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
42 /28

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాములు పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం స్థానిక మామిడిపాలెంలో ఉన్న ఈవీఎం గోదాములను తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన తీరు, గోదాములకు వేసిన తాళాలు, సీళ్లను తనిఖీచేసి సెక్యూరిటీ పరమైన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల విభాగం అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఆసరా డబ్బులు అందరికీ జమ

ఒంగోలు: వైఎస్సార్ ఆసరా డబ్బులు అందరు స్వయం సహాయక సంఘాల సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబూరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 36,139 గ్రూపులు ఉన్నాయని, వాటిలో 3.61 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. అందరి సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు కూడా డబ్బులు జమయ్యాయని, సోమవారం నుంచి మండల సీసీలు వారి లాగిన్ ద్వారా వీఏవోల ద్వారా ఈకేవైసీ కూడా చేస్తారన్నారు. డబ్బులు జమ కాలేదనే వదంతులు నమ్మవద్దని ప్రజలు తమ తమ ఖాతాల్లో సరిచూసుకోవాలన్నారు.

'మార్గదర్శిని'ని కొనసాగించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో విద్యార్థులకు నిర్వహిస్తున్న మార్గదర్శిని కెరియర్ గైడెన్స్ కార్యక్రమం ఈ విద్యా సంవత్సరంలో కూడా మరింతగా ఉపయోగపడేలా కొనసాగించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో మార్గదర్శిని కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కెరియర్ గైడెన్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు ఏర్పడేలా కృషి చేయాలన్నారు. గత ఏడాది 9, 10, 11, 12 తరగతులకు సంబంధించి 75 వేల మంది విద్యార్థులకు మార్గదర్శిని ద్వారా వివిధ అంశాలపై కెరియర్ గైడెన్స్‌పై మెంటార్లతో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా మార్గదర్శిని కెరియర్ గైడెన్స్ వినూత్నంగా చేపట్టాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి వారి భవిష్యత్తుకు ఉపయోగపడేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. దీనిలో జిల్లా విద్యాశాఖ అధికారి, పరిషత్ విద్యాశాఖ అధికారి, సోషల్ వెల్ఫేర్ డీడీ, బీసీ వెల్ఫేర్ డీడీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేసవి..గొంతు తడిసేలా..!

వేసవి వచ్చిందంటే తాగునీటి ఎద్దడి ఎదురవుతుంది. గ్రామాలు, పట్టణాల్లో నీటి ఇబ్బందులు తలెత్తుతాయి. అయితే ఈ సమ్మర్‌లో నీటి కష్టాలు తీర్చేందుకు జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. నీటి సమస్య ఉన్న 562 గ్రామాలను గుర్తించింది. దశల వారీగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం గ్రామీణ మంచినీటి సరఫరా విభాగానికి ఎస్‌డీఆర్ఎఫ్, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.51.81 కోట్లు కేటాయించింది. అలాగే అమృత్ 2.0 పథకం ద్వారా రూ.445.87 కోట్లు ఇచ్చింది. ఈ పథకం ద్వారా పురపాలక సంఘాలు, ఒంగోలు కార్పొరేషన్లలో వివిధ మంచినీటి ప్రాజెక్టు పనులు చేపట్టనున్నారు.

- మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు
- జిల్లాలో 12 మండలాల్లో మంచినీటి అవసరాలు తీర్చేందుకు కసరత్తు
- దశల వారీగా 562 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా
- ఇందుకు ప్రత్యేకంగా రూ.51.81 కోట్లు కేటాయింపు
- అమృత్ 2.0 పథకం కింద జిల్లాలో ఒంగోలుతో పాటు అన్ని మున్సిపాలిటీలకు రూ.445.87 కోట్లు
- కంప్లైంట్ మానిటరింగ్ సెల్‌ల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని అన్ని మండలాల్లో సర్వే చేపట్టింది. చివరకు 12 మండలాల్లోని 562 గ్రామాలను గుర్తించింది. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలు మొత్తం పశ్చిమ ప్రకాశంలోనే ఉన్నాయి. నీటి సమస్య తీర్చేందుకు ప్రభుత్వం గ్రామీణ మంచినీటి సరఫరా విభాగానికి ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.22.81 కోట్లు, 15 ఆర్థిక సంఘం ద్వారా రూ.29 కోట్లు మంజూరు చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటిని అందించేందుకు రూ.1290 కోట్లతో మంజూరైన వాటర్ గ్రిడ్ పనులకు టెండర్లు పూర్తయ్యాయి. వచ్చే నెలలో పనులు ప్రారంభించనున్నారు.

12 మండలాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా...

జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో ఒక మోస్తరు నుంచి తీవ్ర మంచి నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 5 మండలాల్లోని 250 గ్రామాలను గుర్తించారు. దోర్నాల 48, పెద్దారవీడు 41, పుల్లలచెరువు 50, త్రిపురాంతకం 46, యర్రగొండపాలెం మండలంలో 65 గ్రామాలను, అదేవిధంగా మార్కాపురం నియోజకవర్గంలోని కొనకనమిట్లలో 67, మార్కాపురంలో 42, పొదిలిలో 39, తర్లుపాడులో 32 గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే దర్శి నియోజకవర్గంలోని దర్శి మండలంలో 55 గ్రామాలు, దొనకొండ మండలంలో 44, కురిచేడు మండలంలో 33 గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని నిర్ణయించారు.

దశల వారీగా నీటి సరఫరా...

యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల్లో ప్రధానంగా తీవ్ర మంచినీటి ఇబ్బందులు ఉన్న 127 గ్రామాలను గుర్తించిన అధికారులు ఈ ఏడాది జనవరి నుంచే ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 218 ట్యాంకర్ల ద్వారా 1241 ట్రిప్పులు మంచినీటిని అందించారు. ఆ తరువాత 153 గ్రామాలను గుర్తించి ఫిబ్రవరి నుంచి 1725 ట్రిప్పులు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో మరికొన్ని గ్రామాలను గుర్తించారు. అందులో భాగంగా 232 గ్రామాలను గుర్తించిన అధికారులు 2872 ట్రిప్పులు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. మరో 50 గ్రామాలకు వారం రోజుల నుంచి ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు.

ఒంగోలు నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో కూడా...

ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కూడా అవసరమైన శివారు ప్రాంతాల్లోని ప్రజలకు మంచినీటి అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఒంగోలు నగరంలోని 25 వేల గృహాలకు మంచినీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 1.0 పథకం పనులను రూ.123 కోట్లతో చేస్తున్న విషయం తెలిసిందే. ఆ పనులు మరో నెలలో పూర్తి కానున్నాయి. అదేవిధంగా ఒంగోలు నగరానికి అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.339.93 కోట్లతో మంజూరైన పథకం ఈ నెల 29వ తేదీన టెండర్ల ప్రక్రియ పూర్తి కానుంది. అదేవిధంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా ఒంగోలు నగరంతోపాటు ఇతర మున్సిపాలిటీలకు కలిపి మొత్తం రూ.445.87 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకు సంబంధించి జీఓ నంబర్ 68ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.



దొనకొండ మండలం ఇండ్ల చెరువు గ్రామంలో ట్యాంకరు ద్వారా వస్తున్న మంచినీటిని పట్టుకుంటున్న స్థానిక ప్రజలు

గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉంటే సమాచారం ఇవ్వండి



గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలి. జిల్లాలో ఎక్కడ సమస్య ఉన్నా ఒంగోలు ఎస్ఈ కార్యాలయంలోని 08592 233275 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. అదేవిధంగా ఒంగోలు, దర్శి, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని ప్రజలు 08592 233275 నంబర్‌కు, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని ప్రజలు 08499 242252 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిర్యాదులు తీసుకుంటారు. మార్చి మూడో తేదీ నుంచే కంప్లయింట్ మానిటరింగ్ సెల్‌లు ఏర్పాటు చేశాం.

– ఎస్‌కే.మర్దన్ అలీ, ఎస్ఈ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్

గ్రౌండింగ్ అయిన యూనిట్‌లు కొనసాగాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో గ్రౌండింగ్ అయిన యూనిట్లు సుస్థిరంగా కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో ఎస్‌హెచ్‌జీ, ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్‌పై బ్యాంకర్లు సంబంధిత శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. దీనిలో సెర్ప్, డీఆర్‌డీఏల ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్, యూనిట్‌ల గ్రౌండింగ్ తదితర అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలపై చర్చించారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు 1900 యూనిట్లను ప్రతి మండలం నుంచి 50 యూనిట్లను ఏర్పాటు చేసి పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు బ్యాంకులకు టార్గెట్ నిర్దేశించారు. రూ.2 లక్షల లోపు కలిగిన యూనిట్లను కూడా ఏర్పాటు చేసి స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్, బ్యాంకు రుణం, ఎఫ్‌పీఓ తదితర వాటి నుంచి నిధులు సమకూర్చాలన్నారు. ఎఫ్‌పీవోలను బలోపేతం చేసి వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో అనుసంధానం చేసి ప్రతి ఎఫ్‌పీవోకి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎఫ్‌పీవోల ద్వారా లైవ్ స్టాక్‌ను గ్రౌండింగ్ చేసి బీఎంసీయూలను ఎఫ్‌పీవోల ద్వారా ఏర్పాటు చేసి రైతులు ఆర్థికంగా బలపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆవులు, గేదెలు రుణాల ద్వారా పొందిన వారు కచ్చితంగా జగనన్న పాలవెల్లువ పథకంలో పాలు పోసేలా చూడాలన్నారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, పరిశ్రమల శాఖ జీఎం మధుసూదన్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, డిపెంలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన సీఎం

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం రామసముద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు కరపత్రం అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం రామసముద్రం ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తుంటే విమర్శిస్తున్న ప్రతిపక్షాలు గతంలో జన్మభూమి కమిటీల పేరుతో రాజకీయాలు చేశారని, పేదల సంక్షేమాన్ని గాలికొదిలిన ఘనత వారికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ సేథుమాధవన్, తహసీల్దార్ వి కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఏఓ కే నీరజ, ఏపీవో సుజాత, ఏపీఎం కృపమ్మ, ఈఓఆర్డీ మురళీమోహన్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డీప్ బోర్ ప్రారంభించారు.

ప్రకాశం పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్

- లాయర్‌పేట విగ్రహం ఉన్న సెంటర్‌కు ప్రకాశంపంతులు సెంటర్‌గా పేరు మారుస్తాం
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి బాలినేని హాజరై ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రకాశం పంతులు పోరాటాల నేపథ్యంలో ఆంధ్రకేసరి అని బిరుదు ఇచ్చారంటే ఆయన పోరాట పటిమ ఏ విధంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. స్వాతంత్ర్యం సమయంలో ఆయన తెల్లదొరలకు ఎదురుతిరిగిన తీరు యువత తెలుసుకోవాలన్నారు. లాయర్‌పేటలో ప్రకాశం పంతులు కాంస్య విగ్రహం ఉన్న ప్రాంతానికి ప్రకాశం పంతులు సెంటర్‌గా పేరు పెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతేకాకుండా ఆ రోడ్డుకు ప్రకాశం పంతులు రోడ్డుగా నామకరణం చేస్తూ ప్రత్యేక ఆర్చి కూడా నిర్మిస్తామన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ స్వతంత్ర్య పోరాట యోధునిగా ప్రకాశం పంతులు చూపిన తెగువ, పరిపాలనా దక్షత, ఆయన ప్రతిభను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో జిల్లాను అన్నీ రంగాల్లో ముందుకు నడిపిస్తామని చెప్పారు. దీనిలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ బాషా, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాపం పసివాళ్లు

- లేత హృదయాలకు కఠిన శిక్ష!
- హత్యకు గురైన తల్లి
- తల్లిని చంపిన కేసులో జైలుపాలు కానున్న తండ్రి
- దిక్కుతోచని స్థితిలో చిన్నారులు

కనిగిరి రూరల్: పసి వాడని ఆ పసి హృదయాలకు కఠిన శిక్ష పడింది. తల్లి లాలన.. తండ్రి ఆలనలో లోకం తెలియని ఆ పసివాళ్లను విధి అనాథలను చేసింది. తప్పెవరిదీ?. తల్లిదండ్రులు చేసిన తప్పులు, క్షణికావేశాలతో అభం శుభం తెలియని ఆ లేత మనసులకు కన్నీళ్లే మిగిలాయి. వెలిగండ్ల మండల కేంద్రం జిల్లెళ్లపాడు వద్ద వివాహిత దారుణహత్యకు గురైన ఘటన అనేక మలుపులు తిరిగింది. మృతురాలి భర్తే హత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. తండ్రి చేతిలో తల్లి దారుణ హత్యకు గురై విగత జీవిగా మారి లోకం వీడితే.. తండ్రి కటకటాల పాలు కానున్నాడు. లోకం తెలియని ఈ చిన్నారులకు తల్లి తోడు కరువైంది.. తండ్రి నీడ దూరంకానుంది. బిక్కు బిక్కుమంటూ దిక్కులు చూస్తున్న చిన్నారుల పరిస్థితి చూపరులను కంటతడి పెట్టిస్తోంది. ఇద్దరిలో ఎవరో ఒకరు సంయమనం పాటించి ఉంటే ఆ బిడ్డల జీవితాలు ప్రశ్నార్థకంగా మారేవి కావు.

కోటా రాధ, మోహన్‌రెడ్డిలకు ఇద్దరు కుమారులు. మనోజ్ఞరెడ్డికి 8 ఏళ్లు, హనీషిక్ రెడ్డికి 5 ఏళ్లు. నిన్నటి వరకు తల్లిదండ్రుల నీడలో హాయిగా ఆడుతూ..పాడుతూ ఉన్నారు. ఒక్కసారిగా వారి జీవితాల్లో అనుకోని కుదుపు. ఏమి జరిగింది.. ఏమి జరుగుతోందో కూడా తెలుసుకోలేని పసి హృదయాలకు పెద్ద గాయమైంది. 'తల్లిని ఎవరో చంపారు.. తల్లి ఇక మనకు లేదనే విషయాన్ని కూడా పూర్తిగా అవగాహన, ఆలోచన కలిగించుకోలేని పరిస్థితి వీరిది. తల్లి చావుకు కారణం తండ్రేనని, అతను కూడా ఇక తమకు దూరమై కటకటాల పాలవుతున్నాడనే తెలుసుకోలేని.. ఆ లేత మనసులకు ఓదార్పు ఎవరిస్తారు? ఎంతవరకు ఇస్తారు..? అన్నదమ్ములిద్దరూ కలిసి బడి వైపు కూడా అడుగులు వేయలేని వయస్సులో వెన్ను దన్ను ఎవరు.. వీరి భవిష్యత్ ఏమిటీ? అని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఆకలి తెలుసుకుని గోరుముద్దలు తినిపించే తల్లి కనిపించక.. అడిగిందే తడవుగా కొనిచ్చే తండ్రి దూరమై.. వారు పడే వేదన అరణ్య రోదనగా మారింది. ఎవరెంత చేసినా.. అది తల్లిదండ్రుల తర్వాతనే అనేది వాస్తవం. తప్పు తల్లిదా ? లేకా తండ్రిదా..? అనేది ఆ దేవుడికెరుక..! శిక్ష మాత్రం ఈ చిన్నారులకు పడింది. పాపం పసివాళ్లు.



తల్లి రాధతో చిన్నారులు (ఫైల్)

నగర ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

- నూతనంగా మంచినీటి పథకాల కోసం రూ. 581 కోట్లు మంజూరు
- ఒంగోలు నగర పాలక సంస్థ అత్యవసర సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ తదితరులు

ఒంగోలు సబర్బన్: నగర ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ ప్రాంగణంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన మంచినీటి ఎద్దడి నివారణ, తీవ్ర వడగాల్పులు, పారిశుద్ధ్యంపై నిర్వహించిన అత్యవసర సమావేశంలో బాలినేని మాట్లాడారు. ప్రతి ఏటా పెరుగుతూ పోతున్న ఒంగోలు నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు నూతనంగా రూ. 581 కోట్లు అమృత్ 2.0 పథకంలో మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ 1.0 పథకం కింద రూ. 123 కోట్లు మంజూరు చేయించి పనులు ఆ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే పనులు పూర్తి చేయలేక మధ్యలోనే ఆపేశారని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకునికి చెందిన భూమిలో మంచినీటి పథకం వెళుతుంటే పరిహారంగా రూ. 1 కోటి ఇవ్వాల్సి ఉండటంతో పాటు అనేక సమస్యలను పట్టించుకోకుండా పనులు ఆపేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి రుణంగా రూ. 70 కోట్లు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీంతో ఒంగోలు నగర పాలక సంస్థపై టీడీపీ పాలకులు చేసిన పనికి అదనంగా రూ. 70 కోట్ల భారం పడిందని వివరించారు. ఆ పనులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తి కానున్నాయని, 25 వేల ఇళ్ళకు అదనంగా మంచినీటిని అందించనున్నామన్నారు. నగరంలోని నిరుపేదలైన 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందన్నారు. నూతనంగా పట్టాలు ఇచ్చే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకోసం రూ. 51 కోట్లు కూడా మంజూరు అయినట్లు పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, తీవ్ర వడగాల్పుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బాలినేనిని గజ మాలలతో సన్మానించారు. ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ, ఈఈలు, ఎంఈ కె.మాల్యాద్రి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


హాజరైన కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు-1 అభివృద్ధికి రూ. 1.63 కోట్లు

ఒంగోలు సబర్బన్: నగర ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు-1 అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. శనివారం మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ (ఒనూడా) నిధులను కేటాయించింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద వాకింగ్ ట్రాక్‌తో పాటు సోలార్ లైటింగ్, అవెన్యూ ప్లాంటేషన్, యోగా ప్లాట్ ఫామ్, ఓపెన్ జిమ్‌లాంటి ఏర్పాట్లు ఇక్కడ చేస్తారు. ఎస్ఎస్ ట్యాంకు వద్దకు కార్యక్రమానికి వచ్చిన బాలినేని ఒనూడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు బొకే ఇచ్చి ఆహ్వానించారు. ఒనూడా వైస్ చైర్మన్ పి.నిరంజన్ రెడ్డి, ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలత, కార్పొరేటర్లు గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేనికి మంత్రి సురేష్ స్వాగతం


స్పీకర్‌తో మంత్రి ఆదిమూలపు సురేష్

- మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మార్గం మధ్యలో మండల కేంద్రంలోని వెలిగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో ఆయన కొద్ది సేపు విశ్రమించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయనకు స్వాగతం పలికారు. టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి పురస్కరించుకుని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ స్పీకర్ తమ్మినేనితో కొద్దిసేపు మర్యాద పూర్వకంగా ముచ్చటించారు. భోజనం అనంతరం స్పీకర్ తమ్మినేని దంపతులు శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు. తమ్మినేనికి స్వాగతం పలికిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు గంటా రమణారెడ్డి, యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అమిరెడ్డి రామిరెడ్డి, గంటా గురవారెడ్డి, గుమ్మా యల్లేష్, దూదేకుల రసూల్, పవన్‌కుమార్ ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

కొమరోలు: మాయమాటలు చెప్పి 15 ఏళ్ళ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రామావారిపల్లె గ్రామానికి చెందిన మారె గురుప్రసాద్ మూడు నెలల క్రితం కొమరోలులో ఉంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి మండలంలోని గోపాలునిపల్లె సమీపంలోని పొలాల్లోకి తీసుకుని వెళ్ళి లైంగిక దాడి చేశాడు. కాగా ఆ బాలిక గర్భిణీ అయిందని తెలుసుకున్న తల్లిదండ్రులు స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవ రెడ్డి లైంగికదాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కొమరోలు ఎస్సై ఉన్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి


షేక్ మహబూబ్ సాహెబ్ (ఫైల్)

పొన్నలూరు: మండలంలోని మాలపాడులో షేక్ మహబూబ్ సాహెబ్ (74) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. గత వారం రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలకు అస్వస్థతకు గురై శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఎండల్లో వర్షం.. చల్లబడిన వాతావరణం


మార్కాపురం: వర్షానికి నిర్మానుష్యంగా ఉన్న వేముల కోట గ్రామం

మార్కాపురం: గత 10 రోజులుగా తీవ్రమైన ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు శనివారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. మార్కాపురం పట్టణంతో పాటు మండలాల్లోని పలు గ్రామాల్లో కూడా వర్షం పడి వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ప్రతి రోజూ 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో నేడు ఊపిరి పీల్చుకుంటున్నారు.
గిద్దలూరు రూరల్: మండల కేంద్రం గిద్దలూరులో శనివారం సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగి మార్పులు వచ్చి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఎండ తీవ్రతగా ఉన్న సమయంలో ఈ విధంగా వర్షం పడి చల్లదనం సంతరించుకోవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

త్వరలో కేసు ఛేదిస్తాం

- అడిషనల్ ఎస్పీ శ్రీధర్


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రీధర్

కనిగిరి రూరల్: రాధ హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న భర్త మోహన్‌రెడ్డిని పలు స్టేషన్లకు తరలించి పోలీసులు విచారిస్తున్నారు. తొలుత కనిగిరి ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిందితుడు మోహన్‌రెడ్డిని విచారించిన డివిజన్ స్థాయి పోలీస్ అధికారులు, ఆతర్వాత పామూరు సర్కిల్ పరిధిలోని సీఎస్‌పురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరుపుతున్నట్లు సమాచారం. విచారణలో అనుమానితుడు మోహన్‌రెడ్డి తాను ఒక్కడినే భార్యను హత్య చేసినట్లు చెప్పినట్లు తెలిసింది. అయితే మృతురాలి తండ్రి వివరాల ప్రకారం.. ఆయన 17వ తేదీదీ రాత్రి కనిగిరికి వెళ్లే సమయంలో ముగ్గురు వ్యక్తులు హత్య ప్రదేశానికి కొంత దూరంలో కనిపించారని... వారిని ప్రశ్నించగా బీచ్‌కు వెళ్లి వస్తున్నట్లు సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో తాను కనిగిరి పోలీస్‌స్టేషన్ వెళ్లాలనే హడావుడిలో వారిపై దృష్టి పెట్టకుండా వెళ్లి పోయినట్లు తెలిసింది. దర్యాప్తు వేగవంతంగా జరుగుతున్నట్లు అడిషనల్ ఎస్పీ శ్రీధర్ తెలిపారు. 5 బృందాలు హత్య ఘటనపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అన్ని కోణాలు దర్యాప్తునకు ఐదు టీంలు వేర్వేరు ప్రక్రియల్లో విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

నేటి యువతకు స్ఫూర్తి టంగుటూరి

- ప్రకాశం పంతులు వర్ధంతి సభలో వైస్ చాన్సిలర్ మారెడ్డి అంజిరెడ్డి
- వినోదరాయునిపాలెం గ్రామంలో నివాళులర్పించిన ప్రముఖులు


ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్సిలర్ మారెడ్డి అంజిరెడ్డి

నాగులుప్పలపాడు: ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి స్ఫూర్తి, మార్గదర్శి అని ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం వైస్ చాన్సిలర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 66వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం వినోదరాయునిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రకాశం పంతులు చిన్నతనంలో అనుభవించిన పేదరికంతో ఉన్నత విద్య చదివి అత్యంత పేరు మోసిన లాయర్‌గా పనిచేయడంతో పాటు దేశ సేవలో సైమన్ కమిషన్‌నే ధిక్కరించిన నేతగా ఆదర్శప్రాయుడన్నారు. ప్రకాశం పంతులు పుట్టిన గ్రామానికి కూతవేటు దూరమైన నిడమానూరు గ్రామానికి చెందిన తనకు వైస్ చాన్సిలర్‌గా అవకాశం రావడం ఏనాడో చేసుకున్న పుణ్యంగా ఉందన్నారు. ప్రకాశం పంతులు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయిన ఆర్కియాలజిస్టు జ్యోతి చంద్రమౌళిని శాలువాతో సత్కరించి రూ.10,116 నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాలేజి కరస్పాండెంట్ ఉన్నం చంద్రరావు, భైరపునేని సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్‌లు వైస్ చాన్సిలర్‌ను ఘనంగా శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. రమణారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ఉన్నత స్థానం

- న్యాయవాద విద్యార్జన సమయంలో సీనియర్ల వద్ద అప్రెంటిస్ అవసరం
- కోర్టు విధుల పట్ల సానుకూల దృక్పథం అవసరం
- సీనియర్లపై మంచి అభిప్రాయం ఉండాలి
- యువ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులకు హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు సూచన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు

ఒంగోలు: సాధన, పట్టుదలతో న్యాయవాద వృత్తిలో రాణించవచ్చని హైకోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా పోర్టుఫోలియో జడ్జి డాక్టర్ కె.మన్మథరావు అన్నారు. స్థానిక ఇందిర ప్రియదర్శిని లాకాలేజీలో యువ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులకు న్యాయ వ్యవస్థ పనితీరు, న్యాయవాదులు విధి విధానాలు, కోర్టు కార్యక్రమాలపై శనివారం అవగాహన కల్పించారు. పాజిటివ్ థింకింగ్ ఉంటే విజయాన్ని సాధించడం తేలిక అని, ఇలాంటి విధానం అలవర్చుకోవాలన్నారు. సీనియర్ల పట్ల గౌరవ భావం, సాంకేతికత పట్ల అవగాహన ఉండాలని తెలిపారు. సాధారణ కాలేజీలతో పోలిస్తే న్యాయ కాలేజీల్లో వాతావరణం భిన్నంగా ఉంటుందని, సమాజంలో ఎక్కువమందితో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 60 శాతం మంది మహిళా న్యాయమూర్తులు ఉండటం శుభపరిణామంగా పేర్కొన్నారు. తరగతి గదిలో అభ్యసనానికి, కోర్టులో జరిగే అంశాలకు చాలా విభిన్నత ఉంటుందని, అందువల్ల అనుభవమే మెరుగైన ఫలితాలను రాబడుతుందని చెప్పారు. డిగ్రీ పూర్తయిన వెంటనే పరీక్ష రాసి జూనియర్ న్యాయవాదులుగా విధులకు వస్తున్న వారు చాలామంది ఉన్నారని, అటువంటి వారు ప్రాథమిక దశలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి విరుగుడుగా ప్రతి లా కాలేజీ యాజమాన్యం తమ విద్యార్థులను మూడో సంవత్సరంలో సీనియర్ల వద్ద ప్రాక్టీసుకు పంపే యత్నం చేయాలని సూచించారు. కోర్టు పరిశీలనకు కూడా విద్యార్థులకు హాజరైతే కోర్టులో న్యాయవాదులు ఎలా మసలుకోవాలి, న్యాయమూర్తుల పట్ల గౌరవభావం, విధి నిర్వహణలో మెళకువలు, బార్ అండ్ బెంచ్ మధ్య సంబంధాలపై అవగాహన పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో జుడీషియల్ అకాడమీ అందుబాటులో ఉన్నందువల్ల మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నీతి, నిజాయితీని కలిగి ఉంటూ మంచి ప్రవర్తనతో రాణించాలని ఆకాంక్షించారు.

అవగాహన కల్పించడం శుభపరిణామం

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులంతా ఒక చోట చేరి యువ న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. ఏకేయూ విశ్వవిద్యాలయంలో కూడా లా కోర్సును ప్రవేశపెట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మిక్కిలిగా చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు లైబ్రరీని ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ తమ కాలేజీ లాభాపేక్షతో నిర్వహించడం లేదని, ఇందులో ఒక్క పైసా కూడా పాలకవర్గంలోని వారికి చెందవన్నారు. తాజాగా ఎల్ఎల్ఎంకు సంబంధించి రెండు కోర్సులు, ఎల్ఎల్‌బీకి సంబంధించి రెండు అదనపు సెక్షన్లకు యూనివర్శిటీ నుంచి అనుమతి లభించిందని వివరించారు. సీనియర్ న్యాయవాది నాగిశెట్టి మోహన్‌దాస్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నటరాజ్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ల హరిబాబు, అధ్యాపకులు సుంకర సాయిబాబా పాల్గొన్నారు.